క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ లక్ష్యాలు చేరుకోవాలి



సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ లక్ష్యాలను చేరుకోవాలని తహసీల్దార్ ఎస్.సురేష్ చెప్పారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ రీ సర్వే, నీటి తీరువ వసూలు చేయడం, ఏపీ సేవా, మీసేవ పెండింగ్ అంశాలు, మ్యూటేషన్స్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్, జగనన్నకు చెబుదాం, స్పందన ఎన్నికలకు సంబంధించిన విషయాలపై సమీక్ష చేసి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన



ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.భవానీశంకర్ గురువారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించటం జరిగిందని తెలిపారు. తొండపి, దమ్మాలపాడు, మాదల, రుద్రవరం, బొల్లవరం, గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లోను కేంద్రాలను పరిశీలించి కేంద్రంలో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. లేని చోట తీసుకోవాల్సిన చర్యలను బీఎల్ఓలకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆయా గ్రామాల బీఎల్ఓలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



అమరావతి: మండల పరిధిలోని మల్లాది ఎస్సీ కాలనీకి చెందిన సొంగా శ్రీనివాసరావు మృతిచెందగా గురువారం శ్రీనివాసరావు భార్య సొంగా వెంకాయమ్మకు వైఎస్సార్ బీమా పథకం నగదు అందజేశారు. బీమా తొలివిడత సాయం రూ.పదివేలు క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాల లక్ష్మీ నరసింహారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వెంపా వాసు, కోటి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు పంపిణీ



దాచేపల్లి : పత్తిపంటను ఆశించే గులాబి రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ పిడుగురాళ్ల సహాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జాగృతి ప్రాజెక్ట్‌లో భాగంగా బేయర్ కంపెనీ ఆధ్వర్యంలో పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించి రైతులకు లింగాకర్షక బుట్టలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పత్తిలో గులాబి రంగు పురుగును గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని, పంటలో గులాబి రంగు పురుగు ఉధృతిని గమనించి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. గులాబి రంగు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు, లేదా క్లోరోఫైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా స్పైనోసాడ్ 0.3 మిల్లీ లీటర్ల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో డి.పాపకుమారి, ఎల్‌డీసీ కంపెనీ ప్రతినిధులు ఉపేంద్రరెడ్డి, శ్రీరామన్నారయణ, బేయర్ కంపెనీ ప్రతినిధి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

21న కృత్రిమ పాదాల పంపిణీకి అర్హుల ఎంపిక

గురజాల: వాసవి క్లబ్ ఆఫ్ మాచర్ల, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ పాదాలు పంపిణీ చేసేందుకు అర్హుల ఎంపిక శిబిరం నిర్వహించడం జరుగుతుందని క్లబ్ అధ్యక్షులు తెలిపారు. ఈనెల 21వ తేదీన బి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ నందు ఈ శిబిరం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ముందస్తు రిజిస్ట్రేషన్ కోసం 9849065882, 6301556564 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

గాయత్రీపీఠం కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



గాయత్రీపీఠం కృష్ణాష్టమి వేడుకల్లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మండల పరిధిలోని మల్లాది శివారు గ్రామం పొందుగల గ్రామంలో గాయత్రీపీఠం, శ్రీ రామకృష్ణ శాంతి ఆశ్రమం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభా కలశయాత్రలో పాల్గొన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాల లక్ష్మీ నరసింహారావు, గ్రామ మాజీ సర్పంచ్ భవిరి శెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపా వాసు తదితరులతో పాటుగా భక్తులు పాల్గొన్నారు.

క్రోసూరు మండలంలో...

క్రోసూరు: శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని మండలంలోని అని గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండలంలోని హసనాబాద్ గ్రామంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే నంబూరుశంకరరావు పాల్గొని కృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని అనంతవరం గ్రామంలో కృష్ణాష్టమి పండుగ పురస్కరించుకుని నూతనంగా నిర్మింస్తున్న వేణుగోపాలస్వామి దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే హాజరై భూమి పూజ చేసారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ శ్రీకృష్ణాష్టమి పండుగ ఘనంగా నిర్వహించుకోవాలని, పండుగ రోజున ఆలయం నిర్మాణం చేపట్టటం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఈకార్యక్రమంలో హసనాబాద్, అనంతవరం గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, క్రోసూరు మండల అధ్యక్షుడు వెలది అప్పారావు పాల్గొన్నారు. మండలకేంద్రమైన క్రోసూరులో యాదవసంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ఉట్టికొట్టే కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. యువత భారీగా పాల్గొని ఉట్టికొట్టారు. ముందుగా వేణుగోపాలస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని పుర వీధుల్లో భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో ఊరేగించారు.



సత్తెనపల్లిలోని రామాలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

అచ్చంపేటలో...

అచ్చంపేట: కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్థానిక దేవాలయాలలో గురువారం వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు, సీతారాముల దేవాలయాలలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. స్వామి వారిని రుక్మిణీ సమేత శ్రీకృష్ణపరమాత్మగా అలంకరించారు. శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. యాదవ సోదరులచే ఉట్టికొట్టించారు. సాయంత్రం 5గంటల నుంచి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. పలు గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పట్టణం, మండలంలో వాడవాడలా పూజలు, ఉట్టి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గోశాలలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవులకు పసుపు రాసి పూజలు చేశారు. గ్రాసాన్ని అందించారు. కార్యక్రమంలో చలివేంద్ర సంఘం పట్టణ అధ్యక్షుడు శింగరి మధుసూదనరావు, సహాయ కార్యదర్శి కొత్తూరు విశ్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు నోముల వెంకటరమణ, చిలకల శ్రీనివాసరావు, ఆ.వో.ప పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. అలాగే పట్టణంలోని గడియార స్తంభం సమీపంలో గల కోదండ రామాలయంలో శ్రీ కృష్ణుని జన్మదినం సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా రామాలయ భక్త బృందం, శ్రీ ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.



క్రోసూరులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఊరేగింపు, ఉట్టికొట్టుడు



రుక్మిణీ సమేత కృష్ణపరమాత్మ ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తున్న నిర్వాహకులు

గురుకులంలో ట్యాబ్‌లతో బోధన ప్రారంభం



సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురం సమీపంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యాబోధన గురువారం ప్రారంభించారు. విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన స్టేట్ నోడల్ ఆఫీసర్ సీహెచ్‌వీఎస్ రమేష్‌కుమార్, జిల్లా నోడల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావులు పాఠశాలను తనిఖీ సమయంలో ఈ ఏడాది ట్యాబ్‌లతో బోధన ప్రారంభించకపోవటాన్ని గుర్తించి ఉపాధ్యాయులను మందలించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులందరికీ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను అందించి బోధనను ప్రారంభించారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే సౌకర్యాలను అందించివారికి మెరుగైన విద్యాబోధన చేపట్టడం ఉపాధ్యాయుల విధిగా భావించాలని రమేష్‌కుమార్ చెప్పారు. అలాగే కంప్యూటర్‌ల్యాబ్ ను కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

మన గ్రోమోర్‌లో తనిఖీలు

నకరికల్లు: నాణ్యతాప్రమాణాలు కలిగిన పురుగుమందులు, ఎరువులను మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. స్థానిక మన గ్రోమోర్ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా గోడౌన్‌లోని స్టాకు రికార్డులలోని నిల్వలు, క్రయ విక్రయాల రికార్డులు, బిల్లు పుస్తకాలు, అనుమతిపత్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బ్యాచ్‌నంబర్‌తో సహా బిల్లులు ఇవ్వాలని సూచించారు. అనంతరం ముదురకాల మందుల శాంపిల్స్ సేకరించి నాణ్యతా ప్రమాణాలు నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. గ్రోమోర్ కేంద్రం నిర్వాహకుడు సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించండి

మంత్రి అంబటి రాంబాబుకు ఎమ్మార్పీఎస్ నేతల వినతి

సత్తెనపల్లి: ఈ నెల 18 నుంచి 22 తేదీ వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా వైఎస్సార్ సీపీ ఎంపీలు మాట్లాడే విధంగా కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర జలవనరులశాఖమంత్రి అంబటి రాంబాబును ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంత్రి అంబటి రాంబాబును ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగలు కలిసి వినతిపత్రం అందించారు. వైఎస్సార్‌సీపీ లోని పార్టీ పెద్దలతో మాట్లాడి మాదిగలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి వారికి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు చిలకా జయపాల్, ఇంచార్జ్ జలదంకి నరసింగరావు మాదిగ, జిల్లా ఎంఎస్పీ కన్వీనర్ కోటేశ్వరరావు మాదిగ, అశోక్, కూచిపూడి సత్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబుకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నేడు దొడ్లేరుకు ఎమ్మెల్యే రాక

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ భవనాలు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి. అదేవిధంగా గ్రామంలో నూతనంగా బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్సు

క్రోసూరు: ప్రభుత్వం సెప్టెంబర్ 30వ తేదీ నుంచి 45 రోజుల పాటు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బి.మహేష్ కోరారు. గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మండల స్థాయి అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన కార్యక్రమం గురించి ఎంపీడీఓ వివరిస్తూ ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నది ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షగా తెలిపారు. ప్రతి సచివాలయం ఒక యూనిట్ గా తీసుకుని మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెడికల్ క్యాంపులో ఒక్కో సచివాలయానికి నలుగురు వైద్యులు, ఇద్దరు సూపర్‌స్పెషాలిటీ వైద్యులు పాల్గొంటారన్నారు. ఈ నెల 15 నుంచి వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. క్రోసూరు మండలంలోని రెండు పీహెచ్‌సీల ద్వారా ఆరోగ్యసురక్ష శిబిరాలు రోజుమార్చి రోజు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ ఒక టీంగా, తహసీల్దార్ ఒక టీంగా మెడికల్‌క్యాంపులకు హాజరవుతారన్నారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సరిచందన, పీహెచ్‌సీ ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

వడిత్యా శంకర్ నాయక్

వెల్దుర్తి: సుగాలీ, చెంచుకాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని వజ్రాలతండా కాలనీలో పర్యటించి చెంచు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి వసతి, శ్మశాన వాటికలు, విద్యుత్, ఉపాధి వంటి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ స్పందిస్తూ ఒక తండాకు శ్మశానం కోసం స్థలం కేటాయించామన్నారు. నీటి సమస్య, కరెంట్, ఉపాధి పథకం సమస్యలను ఒక నెల రోజుల్లో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను గిరిజనులకు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, మండల తహసీల్దార్, ఎంపీడీఓ ప్రసాద్, అధికారులు, గిరిజన సంఘ నాయకులు, ఇస్లావత్ హనుమంతు నాయక్, అంజి నాయక్, మునావత్ అంజి నాయక్, ఇస్లావత్ రేఖానాయక్, గ్రామ గిరిజన ప్రజలు పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

భార్య మృతి, భర్తకు గాయాలు



రాజుపాలెం: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన మండలంలోని అనుపాలెం సమీపంలోని కాలువ వద్ద మాచర్ల – గుంటూరు రహదారిపై గురువారం జరిగింది. బెల్లంకొండ మండలం మాచాయపాలెంకు చెందిన భార్యాభర్తలు మురికిపూడి యాకోబు, ఏసమ్మలు ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని జానపాడులోని బంధువుల ఇంటికి బయలుదేరారు. గుంటూరు నుంచి మాచర్ల వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఢీకొట్టింది. భర్త యాకోబు మార్జిన్‌లో పడిపోగా స్వల్పగాయాలయ్యాయి. భార్య ఏసుమ్మ(45) తారురోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.నారాయణ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వ్యర్థాల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ

సత్తెనపల్లి: ఘన, ద్రవ, మలవ్యర్థాల నిర్వహణతో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని అబ్బూరు గ్రామ సర్పంచ్ అన్నపూర్ణమ్మ అన్నారు. సత్తెనపల్లి మండలం అబ్బురు గ్రామంలోని సచివాలయంలో లైట్ హౌస్ విలేజ్‌లో భాగంగా ఘన, ద్రవ, మల వ్యర్థాల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమమని గురువారం నిర్వహించారు. ఈ శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇన్‌ఛార్జి ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా ప్రతి నెలా సేవా రుసుము చెల్లించాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఐటీసీ ఎమ్ఎస్‌కె సెర్ప్ సంస్థల ఏపీసీ నారాయణ గ్రామ ప్రజలకు ఘన, ద్రవ, మల వ్యర్థల నిర్వహణపై పీపీటీ సహాయంతో అవగాహన కల్పించారు. సెర్ప్ సీఓ బుజ్జి శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి షేక్ హుసేన్, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఐటీసీ ఎంఎస్‌కే సెర్ప్ సంస్థల ఏపీసీ నారాయణ

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



మృతుడు సత్యం నాయక్ (ఫైల్)

అచ్చంపేట: విద్యుత్ షాక్‌కు రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని జడపల్లి తండాలో గురువారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన బాణావతు సత్యం నాయక్(49) గురువారం ఉదయం తనకున్న ఎకరం పొలంలో మిర్చిపంట వేసేందుకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ మోటారుకు కట్టిన తీగెలు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య పున్నమ్మబాయ్ ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ సంతానం ఉన్నారు. పొలానికి వెళ్లిన ఇంటి పెద్ద మృత్యువాత పడటంతో ఇక తమకు దిక్కెవరంటూ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఎంపీపీ బాణావతు రామకోటేశ్వరరావు కోరారు. అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

మాచవరం: మండలంలోని వేమవరం గ్రామంలో శ్రీ చిదంబర రామలింగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి. సత్యన్నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణం సకాలంలో పూర్తి కావాలని భగవంతుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఈఓ వెంకటరెడ్డి, ట్రస్టు చైర్మన్ మూలగుండ్ల పాపిరెడ్డి, గ్రామ సర్పంచ్ గాదె కనకారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, గ్రామ పెద్దలు ఆదిరెడ్డి, రోశయ్య, పాపిరెడ్డి, ఉస్సేనయ్య, గురవారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎస్కేలు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ముప్పాళ్ళ: నరసరావుపేట నుంచి సత్తెనపల్లి వైపు వెళుతున్న కారు అదుపుతప్పి జీబీసీ కాల్వలోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లిలోని రఘురామ్‌నగర్‌కు చెందిన నరిశేటి సుందరరాజు తన కారులో నరసరావుపేట వైపు నుంచి సత్తెనపల్లి వెళుతూ కారు అదుపుతప్పి గుంటూరుబ్రాంచి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. కారులో ఉన్న సుందరరాజు సురక్షితంగా బయటపడగా, కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. గమనించిన స్థానికులు సుందరరాజును కాలువలోంచి బయటకు తీసి అసుపత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు తెలుగు ఉపాధ్యాయుడు



పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ ఉత్తర్వుల మేరకు జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీలలో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఎ.వెంకటేశ్వర్లు నరసరావుపేటలోని స్టేడియంలో ఈ నెల 4వ తేదీన జరిగిన షెటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ పోటీలలో జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారు. ఈ నెల 8వ తేదీన షెటిల్ బ్యాడ్మింటన్, ఈ నెల 11వ తేదీన స్విమ్మింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలుగు ఉపాధ్యాయులు ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు.

పిల్లల్లో ఆరోగ్య సమస్యలపై అప్రమత్తత అవసరం

నరసరావుపేట: చిన్న పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ డీఎండీహెచ్‌వో డాక్టర్ జి.చంద్రశేఖర్ సూచించారు. వ్యాధుల్ని త్వరితగతిన గుర్తించి తగిన వైద్యం చేయాలని చెప్పారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) హాలులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం, ఫోర్‌డీ స్క్రీనింగ్ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు 330 మంది హాజరయ్యారు. పుట్టుకతో వచ్చే లోపాలు, చిన్న పిల్లలో వచ్చే వ్యాధులు, లోపాలు, చికిత్సలపై శిక్షణ ఇచ్చారు. డాక్టర్ బి.రవిని సభకు పరిచయం చేశారు.

ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి

నెల్లూరు జోన్ 3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొచెర్ల ఆదాం సాహెబ్

పిడుగురాళ్ల: ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని ఆర్టీసీ నెల్లూరు జోన్ 3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొచెర్ల ఆదాం సాహెబ్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను గురువారం సందర్శించారు. ముందుగా డిపోలోని గ్యారేజిని పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తలు, సూచనలు పాటిస్తే ఆర్టీసీని మరింత లాభాల్లో నడిపించవచ్చని తెలిపారు. ఉద్యోగస్తులు నిర్వహించాల్సిన విధి విధానాలపై సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆగస్టు నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు కె.ఆదినారాయణ, వి.రాంబాబు, డ్రైవర్లు ఎంపీ నాయక్, బొప్పి రవిలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంవీ నర్రా శ్రీనివాసరావు, డిప్యూటీ సీటీఎం(కమర్షియల్) షేక్ ఇబ్రహీం, పల్నాడు ప్రజా రవాణా అధికారి ఎస్.వెంకట శ్రీనివాసరావు, పిడుగురాళ్ల డిపో మేనేజర్ ఎస్.ముక్తేశ్వరావులతోపాటు ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.